క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ నూర్‌ఖాన్‌బజార్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

యాకుత్‌పురా: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ గ్రీన్ జాబ్స్ ప్రోగ్రాంలో భాగంగా తెలుగు రాష్ట్రాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు మొదటి సారిగా ఎలక్ట్రిక్ వెహికిల్ మెయింటెనెన్స్‌పై ఈ నెల 24 నుండి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ చెరువు రాఘవేందర్‌రావు తెలిపారు. రెండు నెలల పాటు నిర్వహించే ఈ శిక్షణ కోర్సులకు 18 నుండి 28 ఏళ్ల లోపు వయస్సు గల ఐటీఐ, డిప్లొమో (ఎలక్ట్రికల్, మెకానికల్, ఆటోమొబైల్) పూర్తి చేసిన వారు ఈ నెల 24 లోపు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు. ఎంపికైన వారికి మదీనాగూడలోని కల్లం అంజిరెడ్డి జూనియర్ ఒకేషనల్ కాలేజ్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నామన్నారు. వివరాలకు 8247891195, 8019050334 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

నేడు కోటలో చివరి బోనం పూజ

గోల్కొండ: ఆషాడ మాసపు బోనాల జాతర ఉత్సవాల్లో సందర్భంగా గోల్కొండ కోటలో గురువారం 9వ బోనం పూజతో ముగియనున్నాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు తెలిపారు. కోటలో కొలువుదీరి ఉన్న శ్రీ జదాంబిక మహంకాళి అమ్మవార్లకు ఆషాడ మాసంలో ఈ పూజలు జరుగుతాయి.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

డబీర్‌పురా: డబీర్‌పురా కోమటివాడిలోని పిలక్‌మాత (శ్రీ శీతలాదేవి) దేవాలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎ.కృష్ణ కుమార్, జి.నారాయణ, జి.భాస్కర్, ఉపాధ్యక్షులు కె.రఘు, పి.జగదీష్, ప్రధాన కార్యదర్శి జి.మహేందర్ పాల్గొన్నారు.

బోనాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

చార్మినార్: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహించడానికి సహకరించిన వివిధ విభాగాల ప్రభుత్వాధికారులతో పాటు భక్తులందరికి పేరు పేరున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు గౌలిపురా మహంకాళి మాతేశ్వరి భరతమాత ఆలయం, కోట మైసమ్మ దేవాలయం కార్య నిర్వాహక అధ్యక్షులు కె.ఎస్.ఆనంద్ రావు ప్రకటించారు. ఈ నెల 7వ తేదీన కలశ స్థాపనతో ప్రారంభమైన ఉత్సవాలు 9వ తేదీన ఘట స్థాపన ఊరేగింపు, 16వ తేదీన అమ్మవారికి బోనాల సమర్పణ, 17వ తేదీన అమ్మవారి ఘటాల పరిసమాప్తి ఊరేగింపు తదితర పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించామని... భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ఉత్సవాలకు సహకరించిన పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు, విద్యుత్ అధికారులు, జలమండలి అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

ప్రొటోకాల్ విభాగంలో బోనాల జాతర



నాంపల్లి: పబ్లిక్ గార్డెన్స్‌లోని ప్రొటోకాల్ విభాగంలో బుధవారం బోనాల ఉత్సవం వైభవంగా జరిగింది. ఉద్యోగుల కార్యాలయ ఆవరణలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సీఎస్ శాంతికుమారి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఉద్యోగులతో కలిసి అమ్మవారికి బోనాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపు ఆకట్టుకున్నాయి.

హోం మంత్రిని కలిసిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి

చాంద్రాయణగుట్ట: అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకున్న బీఆర్‌ఎస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి ముప్పిడి సీతారాంరెడ్డి బుధవారం హోం మంత్రి మహమూద్ అలీని కలిశారు. అనారోగ్యానికి గురైన సమయంలో హోం మంత్రి అన్ని విధాల సహాయ సహకారాలు అందించినందుకు ఆయనను కుటుంబ సభ్యులతో కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

కాలనీలు ముంపునకు గురికాకుండా చర్యలు

గోల్కొండ: నానల్‌నగర్, టోలిచౌకి డివిజన్లలో ఒక్క కాలనీ కూడా ముంపునకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన టోలిచౌకి చౌరస్తా, ఎండీ లైన్స్ రోడ్డు, రియాసత్ నగర్ కాలనీ, నిజాం కాలనీ, అల్ హస్నాత్ కాలనీలలో పర్యటించి ఆయా ప్రాంతాలలో కొత్తగా నిర్మించిన బాక్స్ టైప్ డ్రైనేజీలను పరిశీలించారు. బాక్స్ టైప్ డ్రైనేజీ నిర్మాణం వల్ల వరద ప్రవాహానికి చెక్ పెట్టినట్లయందన్నారు. దీనివల్ల వర్షపు నీరు నేరుగా శాతం తలాబ్‌లోకి చేరుతుందన్నారు. మరోవైపు శాతం తలాబ్ పొంగిపొర్లకుండా కూడా శాతం తలాబ్ స్లూయిజ్‌ను అభివృద్ధి పరిచామన్నారు. ఆయన వెంట బల్దియా అధికారులతో పాటు నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.



నానల్‌నగర్ డివిజన్ సాలార్ బ్రిడ్జి వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: రచయిత్రి సరోజినిదేవి కవితల్లో సున్నితమైన భావాలు అందమైన పదాలతో ఆకట్టుకుంటాయని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పాలడుగు నాగయ్య కళాపీఠం ఆధ్వర్యంలో పాలడుగు నాగయ్య జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సరోజినిదేవి రచించిన సరోజినిదేవి కుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానవీయ పరిమళాలు సరోజిని కవితా కుసుమాలు అని కొనియాడారు. అంతకుముందు కవి సమ్మేళనం, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త జేబీ రాజు, కవులు గంటా మనోహర్ రెడ్డి, రామకృష్ణ చంద్రమౌళి, రచయిత అలపాటి, గద్ద నర్సింగ్‌రావు, చైతన్య కిషోర్, బడే సాబ్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోల్కొండ: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుడిమల్కాపూర్ బీజేపి నాయకులు దేవర వంశీ అన్నారు. బుధవారం ఆయన గుడిమల్కాపూర్ డివిజన్‌లోని లోతట్టు బస్తీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మరికొన్ని రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న విషయాన్ని వాతావరణ శాఖ వారు తెలిపారని అన్నారు. పూరిగుడిసెల వారు పాత ఇళ్లల్లో నివాసం ఉండే వారు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. కాగా తాను బల్దియా అధికారులను సైతం కలిసానని, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అవసరం అయితే సహాయ చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని కోరామన్నారు.

ఆకట్టుకున్న నృత్యాంగన

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ సంగీత కళలకు పెద్దపీట వేస్తోందని తెలంగాణ రాష్ట్ర మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సింగిడి కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నృత్యాంగన పేరిట డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... దేశాలకు చెందిన ప్రతినిధులు భారతీయ కళల పట్ల ఆక్తి కనబరచడం ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం ప్రముఖ నృత్య కళాకారిణి మేరీ ఇలన్ గోవన్, జార్ఖండ్‌కు చెందిన సెరైకెలా నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోగా కేరళకు చెందిన అతిర నందన్ కథాకళి, కర్ణాటకు చెందిన రెమోనాచే యక్షగాన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎస్.మధుసుదనాచారి, సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరు గౌరిశంకర్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సింగిడి అంతర్జాతీయ ప్రతినిధులు అంజాన రాజపక్షే, కిశోర్, శ్రీదేవి, హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ విశ్వకర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలల దోపిడీని అరికట్టాలి



ప్రొఫెసర్ లింబాద్రికి వినతిపత్రం అందజేస్తున్న వినోద్ కుమార్

గన్‌ఫౌండ్రీ: ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల్లో ఎలాంటి షరతులు లేకుండా కొత్త సీట్లకు అనుమతులు ఇవ్వడం సరికాదని తెలంగాణ జన సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుదవారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ ఉన్న కోర్సులకు సీట్ల సంఖ్య పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో అనేక కళాశాలలు దోపిడీకి తెరలేపాయని ధ్వజమెత్తారు. ఒక్క అడ్మిషన్‌కు రూ.8 నుంచి 10లక్షల వరకు విద్యార్థుల నుంచి వసూల్ చేస్తున్నారని ఆరోపించారు. కొత్త సీట్ల భర్తీని కూడా కన్వీనర్ కోటాలో చేపట్టాలని లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నరహరి గౌడ్, భసంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కొండ చిలువతో నృత్యం.. కేసు నమోదు

చాంద్రాయణగుట్ట: బోనాల జాతర ఉత్సవాలలో ఓ కళాకారుడు కొండ చిలువతో విన్యాసాలు చేయడం సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతోంది. వివరాల్లోకి వెళితే....ఈ నెల 17వ తేదీనా పాతబస్తీ బోనాల జాతర ఊరేగింపులో విజయవాడ నుంచి వచ్చిన రాంపల్లి సాయికుమార్(25) అనే కళాకారుడు శాలిబండ రోడ్డులో తన వెంట తెచ్చుకున్న కొండ చిలువను మెడలో వేసుకోవడంతో పాటు ప్రాణాంతక రీతిలో నృత్యం చేశాడు. సమాచారం అందుకున్న శాలిబండ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. కొండ చిలువను అటవీశాఖ అధికారులకు అప్పగించారు.



కొండ చిలువతో నృత్యం చేస్తున్న యువకుడు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



పైప్‌లైన్ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

చాంద్రాయణగుట్ట: మజ్లిస్ పాలనలో పాతబస్తీ అభివృద్ధికి నోచుకోవడం లేదని బీజేపీ సీనియర్ నాయకుడు ఎర్రవెల్లి అశోక్ రావు అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖతో జలమండలి నుంచి మంజూరైన రూ. 38 లక్షల నిధులతో లలితాబాగ్‌లో చేపట్టనున్న పైప్‌లైన్ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ రావు మాట్లాడుతూ....డివిజన్‌లోని భయ్యాలాల్‌నగర్, మారుతీనగర్, లాస్ట్ బస్టాప్, కోట మైసమ్మ ఆలయ పరిసరాలలో 300 మీటర్ల మేర పైప్‌లైన్ వేస్తుండడంతో స్థానిక ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పనున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన కిషన్‌రెడ్డితో పాటు జలమండలి అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బర్ల శ్రీనివాస్, ధరంకార్ రాజేందర్ పాల్గొన్నారు.

కేసీఆర్ సర్కార్.. ఇతర రాష్ట్రాలకు ఆదర్శం



మమతా గుప్తా, సంతోష్‌గుప్తాలను సత్కరించిన దృశ్యం

అబిడ్స్ : అన్నివర్గాల ప్రజల పండుగలను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం స్వయంగా చేపడుతుందని నగర గ్రంథాలయ డైరెక్టర్, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌గుప్తాలు పేర్కొన్నారు. ఆలయాల నిర్వాహకులు సంతోష్‌గుప్తా, మమతా గుప్తాలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను చాటే విధంగా అన్ని ప్రాంతాల్లో బోనాల వేడుకలతో పాటు అన్ని పండుగలు జరుగుతున్నాయన్నారు. అన్నివర్గాల ప్రజల పండుగలను ప్రభుత్వం చేపట్టం దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం స్వయంగా పండుగలను నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలిచిందన్నారు.

బావపై దాడి చేసిన నలుగురు వ్యక్తుల అరెస్టు

విజయనగర్‌కాలనీ: బావపై దాడిచేసిన బావమరిది, అతని ముగ్గురు కుమారులు అరెస్టు అయ్యారు. ఈ సంఘటన బుధవారం ఆసిఫ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ మహ్మద్ జహెద్ తెలిపిన మేరకు.. ఆసిఫ్‌నగర్ జేబాబాగ్‌కు చెందిన బషీర్ హైమద్ అలియాస్ షౌకత్(54) కుమారుడుతో ఇదే ప్రాంతంలో ఉంటున్న అతని బావ రఫీక్ అహ్మద్ కుతురుతో గత మూడు సంవత్సరాల క్రితం పెళ్లి సంబంధం కుదుర్చుకున్నాడు. అనివార్య కారణాల వల్ల ఆ సంబంధం రద్దు కావడంతో అప్పటి నుంచి ఇద్దరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. ఇది ఇలా ఉండగా ఈ నెల 18న రఫీక్ అహ్మద్ జేబాబాగ్ నుంచి జిర్రా వైపు వెళ్తుండగా సాయంత్రం 5.30 గంటల సమయంలో బషీర్, అతని కుమారులు వసీమ్(35), అజీజ్(30), రియాజ్(28)లు దాడి చేశారు. తీవ్ర గాయాలు అయిన బాధితున్ని చికిత్స నిమిత్తం బంజారా కేర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నేటి నుంచి మొహర్రం సంతాప దినాలు

- పాతబబస్తీలో 68 రోజుల పాటు కొనసాగనున్న మొహర్రం సంతాప దినాలు..
- ఈ నెల 29న చార్మినార్ ప్రధాన వీధుల్లో పదో మొహర్రం ఊరేగింపు

చార్మినార్: మహ్మద్ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సలుల్లాహి అలైహి వసల్లం మనుమడు హజ్రత్ ఇమాం హుస్సేన్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ షియా ముస్లిం ప్రజలు గురువారం ఉదయం నుంచి సంతాప దినాలను పాటించనున్నారు. పాతబస్తీలోని వివిధ ఆషుర్‌ఖానాలలో బుధవారం సాయంత్రం ఆలంలను ప్రతిష్టించారు. 68 రోజుల పాటు నిర్వహించే ఈ సంతాప దినాల సందర్భంగా షియా ముస్లిం ప్రజలు ప్రతి రోజు ఆషుర్‌ఖానాలలో మజ్లిస్, మాతం నిర్వహించనున్నారు. పదో మొహర్రంను పురస్కరించుకుని ఈ నెల 29న పాతబస్తీ చార్మినార్ ప్రధాన వీధుల్లో షియా ముస్లింలు పెద్ద ఎత్తున సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నారు. చిన్నా,పెద్ద అనే తారతమ్యం లేకుండా దారిపొడవున చురుకైన కత్తులు,సూదులతో ఎదపై బాదుకుంటూ రక్తాన్ని చిందిస్తారు.

పాతబస్తీ వీధుల్లో అంబారీపై బీబీకాఆలం ఊరేగింపు

పదో మొహర్రం సందర్భంగా ఈ నెల 29న, పాతబస్తీ వీధుల్లో నిర్వహించే బీబీకాఆలం అంబారీ సామూహిక ఊరేగింపును పురస్కరించుకుని సాధారణంగా ప్రతి ఏడాది 4వ మొహర్రం రోజు పాతబస్తీ వీధుల్లో ముందుగానే రిహార్సల్స్ నిర్వహిస్తారు. ముందస్తుగా ఈ రిహార్సల్స్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పదో మొహర్రం ఊరేగింపునకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన మాధురి అనే ఏనుగును వినియోగిస్తారు. డబీర్‌పురా బీబీకాఅలావా నుంచి బయలు దేరే ఈ ఊరేగింపు చార్మినార్ కట్టడం మీదుగా గుల్జార్‌హౌజ్, కాలీకమాన్,మీరాలంమండి, పురానాహవేలీ, దారుషిఫా మీదుగా చాదర్‌ఘాట్ వరకు కొనసాగుతుంది. దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, అదనపు డీసీపీ ఆనంద్, మీర్‌చౌక్ ఏసీపీ దామోదర్ రెడ్డి తదితరులు పదో మొహర్రం సామూహిక ఊరేగింపును స్వయంగా పర్యవేక్షించనున్నారు. అదనపు బలగాలతో గట్టి బందోబస్తు నిర్వహించనున్నారు. ఇస్లాం పరిరక్షణ కోసం అశువులు బాసిన హజ్రత్ ఇమాం హుస్సేన్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ షియా ముస్లిం ప్రజలు మొహర్రం సంతాప దినాలను పాటిస్తారు.

68 రోజుల పాటు...

పాతబస్తీలోని అన్ని ఆషుర్‌ఖానాలలో షియా ముస్లింలు మాతం, మజ్లిస్ నిర్వహించనున్నారు. 68 రోజుల పాటు కొనసాగే ఈ సంతాప దినాలను పురస్కరించుకుని పలువురు అధికార, అనధికార ప్రముఖులు డబీర్‌పురాలోని బీబీకాఅలావాను సందర్శించి ఆలంలకు దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ నెల 29న..ఒకటవ మొహర్రం ప్రారంభం కానుండడంతో షియా ముస్లిం ప్రజలు సంతాప దినాలను పాటిరచనున్నారు. సంతాప దినాల్లో భాగంగా ఈ నెల 29న, పాతబస్తీ వీధుల్లో అంబారీతో 10వ మొహర్రం సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నారు. డబీర్‌పురా బీబీకాఅలావాకు చెందిన బీబీకాఆలంతో షియా ముస్లింలు ఈ ఊరేగింపులో పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తాన్ని చిందించనున్నారు.

పోలీస్ కమీషనర్ సీవీ.ఆనంద్‌కు సత్కారం

అబిడ్స్: నగర పోలీస్ కమీషనర్ సీవీ ఆనంద్‌ను పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ సిటీ అధ్యక్షులు నల్లా శంకర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి సత్కారం చేశారు. జంట నగరాల్లో బక్రీదు, బోనాల ఉత్సవాలకు పోలీస్‌శాఖ ఎంతో పకడ్బందిగా బందోబస్తు చేపట్టిందని కమీషనర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కమీషనర్‌తో పాటు వారి బృందానికి అభినందనలు తెలిపారు.

మంత్రి తలసానికి సన్మానం

యాకుత్‌పురా: బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగేందుకు సహకరించిన రాష్ట్ర సినిమాటోగ్రఫి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం కమిటీ సభ్యులు బుధవారం ఆయన నివాసంలో కలిసి శాలువా కప్పి గజమాలతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రాందేవ్ అగర్వాల్, కోశాధికారి ఎ.సతీష్ కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శి ఎస్.క్రాంతి కుమార్, సభ్యులు రజత్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీఏ జాయింట్ కమిషనర్‌కు సిబ్బంది అక్రమాల అవినీతిపై ఫిర్యాదు



జాయింట్ కమిషనర్ పాండురంగ నాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

అబిడ్స్: ఆర్టీఏ కార్యాలయంలో అవినీతి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీఏ జాయింట్ కమిషనర్ పాండురంగ నాయక్‌ను కలిసి ఆర్టీఏ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు చేస్తున్న అక్రమాలపైన ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా ఇద్దరు ఉద్యోగులు తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మూడురోజులలోపు ఆ ఇద్దరి ఉద్యోగులపై చర్యలు తీసుకోనిచో తమ టీఎన్జీఓస్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పాండురంగనాయక్ సానుకూలంగా స్పందించారు. విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, కేఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, శ్రీధర్, అరుణేందర్, పవన్, కాళీద్ అహ్మద్, శంకర్, వైదిక్ శాస్త్రి, ముఖిమ్ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి



కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: వర్షాకాలం సందర్భంగా లోతట్టు ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో బుధవారం ఆయన నియోజకవర్గ పరిధిలోని యాకుత్‌పురా, రెయిన్‌బజార్, ఎస్సార్టీ కాలనీ, దోభిఘాట్ ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు ప్రధాన రోడ్లపై కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలమయమైన ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించామన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలకు వరదనీటి సమస్యలు రాకుండా అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు మజ్లీస్ పార్టీ నాయకులు, జీహెచ్ఎంసీ, జలమండలి విభాగాల అధికారులు ఉన్నారు.

ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవన నిర్మాణం చేపట్టాలి

అఫ్జల్‌గంజ్: నిత్యం వేలాది మంది రోగులు వచ్చే ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి వెంటనే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించకపోతే తమ కార్యాచరణ ప్రకటించి ఆందోళన చేపడతామని జేఏసీ ఫర్ న్యూ ఓజీహెచ్ ప్రతినిధి, జూనియర్ డాక్టర్ పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆస్పత్రిలోని అవుట్ పేషంట్ బ్లాకు వద్ద జేఏసీ ప్రతినిధులు కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు ఉస్మానియా నూతన భవనం కోసం వారం రోజుల్లో హైకోర్టుకు వెళ్తామని చెప్పి పదిహేను రోజులు గడుస్తున్నా ఆ దిశగా ఎలాంటి కార్యాచరణ లేదన్నారు. ఆస్పత్రికి నూతన భవనం కోసం దాదాపు 10 సంవత్సరాలుగా వైద్యులు నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆస్పత్రిలో స్థలం సరిపోక అటు రోగులు ఇటు వైద్యులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆస్పత్రికి వచ్చే పేద రోగులను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని లేని పక్షంలో జేఏసీ తరపున తమ కార్యాచరణ ప్రకటించి ఆందోళనకు దిగుతామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసి ప్రతినిధులు

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



గోల్కొండ: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని కల్నల్ హెచ్‌ఎఫ్ గ్రేవల్ అన్నారు. బుధవారం మెహిదీపట్నం మురాద్‌నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కొత్తగా ఎన్నికైన స్కూల్ లీడర్లకు బ్యాడ్జీలు అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. క్రమశిక్షణతో చదువులు పూర్తి చేసి తమకిష్టమైన రంగాలలో పని చేస్తూ రాణించాలని ఆయన విద్యార్థులను కోరారు. అంతేకాకుండా పెద్దలను గౌరవించడంతో పాటు సేవా గుణాలను కూడా అలవర్చు కోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రవీంద్రభారతి పాఠశాలల మెహిదీపట్నం జోన్ డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మీ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని రక్షించుకోవాలి.

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న నాటకాలను రక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతగానో ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నీలం థియేటర్ గోపరాజుపల్లి సంస్థ ఆధ్వర్యంలో నీలం నరేష్ రచన దర్శకత్వంలో నీలం అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొంతమంది మనుషుల్లో ఉన్న స్వార్థ పూరిత ఆలోచనల వల్ల కలిగే నష్టాన్ని అద్భుతంగా ప్రదర్శించారని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల శాఖధిపతి ప్రొఫెసర్ కోట్ల హనుమంతురావు, అసోసియేట్ ప్రొఫెసర్ బి హెచ్ పద్మప్రియ, రంగస్థల రచయతలు మల్లేష్, ఖాజా పాషా, సురభి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్

గోల్కొండ: క్రమశిక్షణకు మారుపేరు బీజేపీ అని, అవినీతి రహితంగా పాలించే సత్తా కేవలం బీజేపికే ఉందని ఆపార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్ అన్నారు. బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో గుడమల్కాపూర్‌లోని ఎస్‌బీఐ కమ్యూనిటీ హాల్‌లో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టిఫిన్ బైఠక్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రధాని మోదీ ఏదేశకేగిన అక్కడ ఆయనకు అఖండ స్వాగతం లభిస్తుందన్నారు. మోదీ పాలనలో మన దేశం అగ్రరాజ్యాల సరసన చేరిందని అన్నారు. మోదీ సమర్థ పాలనకు ప్రపంచ దేశాలు మెచ్చుకుంటున్నాయని ఆయన అన్నారు. కార్యక్రమలో బీజేపీ నాయకులు రాములు, దేవర వంశీ తదితరులున్నారు.

బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

గోల్కొండ: బీజేపీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణ సైనికుల వలె పని చేయాలని బీజేపీ తెలంగాణ ఎన్నికల ఇంచార్జ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్ బుధవారం ఆయనను కలిసి తెలంగాణ ఎన్నికల ఇంచార్జ్‌గా నియమితులైన ఈటలను సన్మానించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... బీజేపీ హవా ముందు బీఆర్‌ఎస్ కొట్టుకుపోవడం ఖాయమన్నారు.